# 15 వరకు పల్స్ పోలియో కొనసాగింపు

**చిన్నారుల బంగారు బంగారు భవిష్యత్తుకు**
**పోలియో చుక్కలు తప్పక వేయించాలి**
**జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త
చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలు తప్పక వేయించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. తిలక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలువేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్‌కు పల్స్ పోలియో చుక్కలను తప్పక వేయించాలని అన్నారు. భారతదేశంలో పోలియో రహిత సమాజాన్ని నిర్మాంచడానికి పల్స్ పోలియో 1995లో ప్రారంభించడం జరిగిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014లో భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేసారు. పొరుగు దేశాలలో ఇంకా పోలియో కేసులు నమోదు అవుతున్నందున భారతదేశంలో పోలియో కేసులు నమోదు కాకుండా పోలియో కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించుకొని 2586 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని ఆమె తెలిపారు. జిల్లాలో 05 పిల్లలు 5,17,238 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం 13వ తేదీ నుండి 15 వరకు కొనసాగుతుందని, 12వ తేదీన పోలియో చుక్కలు



తిలక్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

వేయించలేనటువంటి పిల్లలకు 11200 మంది వైద్య సిబ్బంది ఇంటింటి కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలు అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 0 5 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే 164 హై రిస్క్ ప్రాంతాలలో పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 15 వరకు అన్ని రైల్వేస్టేషన్స్, బస్టాండ్లు అలాగే మెట్రో స్టేషన్లలో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని 2586 కేంద్రాలతో పాటు 91 మొబైల్ టీమ్స్ చిన్నారులకు వలస వాసుల ప్రాంతాలు, తాత్కాలిక నివాసాలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు అలాగే పార్కులలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డిఎంఓ రాములు, డిప్యూటీ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త



ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

* సర్వం సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు
* 200 మీటర్లవరకే ఊరేగింపులకు అనుమతి
* 18 ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌లు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు ఈ నెల 13(నేటి) నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంతోపాటు సంబంధిత సిబ్బంది ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు. ఈ నెల 13 నుంచి 21వ తేది వరకు నామినేషన్లను స్వీకరించేందుకు అధికారులు అవసరమైన సన్నాహాలు చేశారు. ఇమందులో 19, 20 తేదీలు సెలవు దినాలు రావడంతో ఆయా రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు షేక్‌పేట మండల కార్యాలయంతోపాటు మరో 18 ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. పశ్చిమ మండల డీసీపీ చింతమనేని శ్రీనివాస్, అదనపు డీసీపీ గోవర్ధన్, ఏసీపీలు సామల వెంకటరెడ్డి, మురళీకృష్ణ, అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, తొమ్మిది మంది ఎస్సైలతో పాటు సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తించనున్నారు.

**15 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు**

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా 15 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 5 వీడియో సర్వైలెన్స్ బృందాలు నియోజకవర్గంపై దృష్టి పెట్టనున్నాయి. అలాగే అభ్యర్థుల ప్రచారాలు, సభలకు సంబంధించి మూడు రోజుల ముందు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోనేలా, ఫిర్యాదులు చేసేందుకు సీ-విజిల్ యాప్‌ను ఎన్నికల అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీరితోపాటు ఇద్దరు వ్యయ పరిశీలకులు సైతం అభ్యర్థుల ఖర్చును గమనించనున్నారు.

**నామినేషన్ కేంద్రం వద్ద 144 సెక్షన్**

నామినేషన్‌వేసే షేక్‌పేట మండల కార్యాలయం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపారు. 100 మీటర్ల దూరంలో పోలీసు గార్డు, 200 మీటర్ల దూరంలో పోలీసు పికెట్ ఉండేలా ఏర్పాట్లు చేశారు. నామినేషన్ కేంద్రంతోపాటు చుట్టూ 18 పికెట్ పాయింట్లులు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే ర్యాలీలు, ఊరేగింపులకు కేంద్రానికి 200ల మీటర్ల దూరం ముందు వరకే అనుమతి ఉంటుందన్నారు. కేంద్రానికి 100 మీటర్ల వరకే మూడు వాహనాలకు అనుమతి ఉంటుదన్నారు. అక్కడి నుంచి అభ్యర్థితో కలిసి అయిదుగురికే లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. పోలీసులతో పాటు ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని, వీడియో చిత్రీకరణ చేపడుతారన్నారు. నినాదాలు, పార్టీ జెండాలతో ర్యాలీలు, నిబంధనలను అడ్డుకున్నా, నిబంధనలను ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామన్నారు.

**స్ట్రాంగ్ రూం సిద్ధం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబరు 11న జరగనుంది. మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఇందుకు అవసరమైన ఈవీ ఎంలు, బ్యాలెట్ యూనిట్లను భద్రపరిచేందుకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఎన్నికల అధికారులు ఇప్పటికే స్ట్రాంగ్‌రూంను ఏర్పాటు చేశారు. మూడంచల భద్రతతో పోలీసులు ఇక్కడ పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల అధికారులను మినహాయించి మరెవరికి ఇక్కడ లోపలికి అనుమతించరు.



# థార్ కారు బీభత్సం..!

**మద్యం మత్తులో రెచ్చిపోయిన యువకులు**
**కారుతో ర్యాష్ డ్రైవింగ్...ఐదుగురికి తీవ్రగాయాలు**

**హైదరాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు వాహనదారులు మారడం లేదు. వనస్థలిపురం గుర్రంగూడ వద్ద కారు బీభత్సం సృష్టించింది. యువకులు మద్యం మత్తులో రెచ్చిపోయారు. కారుతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టి డివైడర్ దాటి మరో కారును ఢీకొట్టి బోల్తా పడింది థార్‌కారు. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం..బీఎన్ రెడ్డినగర్ సమీపంలోని గుర్రంగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇంజాపూర్ నుంచి గుర్రంగూడ వైపు వేగంగా దూసుకొచ్చిన థార్ వాహనం అదుపు తప్పింది. అనంతరం, మొదట రోడ్డుపై వెళ్తున్న ఓ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సందర్భంగా బైక్‌పై ప్రయాణిస్తున్న విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. సదరు విద్యార్థిని సిరిసిల్లకు చెందినట్టు తెలిసింది. దీంతో, వెంటనే ఆమెను మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇక, వాహనం ఎక్కువ వేగంతో ఉండటంతో డివైడర్‌ను దాటుకుని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఆ తర్వాత వాహనం గాల్లోకి లేచి మూడు పల్టీలు కొట్టి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో థార్ వాహనంలో ఉన్న డ్రైవర్‌తో పాటు యజమాని అనిరుధ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, రెండో కారులో ప్రయాణిస్తున్న దినేష్, శివ అనే ఇద్దరు వ్యక్తులు కూడా గాయపడ్డారు. గాయపడ్డ యువకులు హస్తినాపురంలోని రెండు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# బ్యాంకు ఉద్యోగి మోసం

**- బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** బ్యాంకులో ఉద్యోగం చేసుకుంటూ అదే బ్యాంకులో తాకట్టుపెట్టిన కస్టమర్ బంగారాన్ని మాయం చేసిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. కళ్యాణ్‌నగర్‌లోని కరూర్ వైశ్యబ్యాంక్‌లో అరిపాక సతీష్‌కుమార్ ఫ్రీలాన్స్ అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. 13ఏళ్లుగా బ్యాంకులో ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అయితే జూన్ 26న దేవేందర్‌రెడ్డి అనే వ్యక్తి బ్యాంకులో తాకట్టుపెట్టిన బంగారం చూపాలంటూ మేనేజర్‌ను కోరారు. దీంతో 35 గ్రాముల రెండు బంగారు గొలుసులు కనిపించలేదు. బ్యాంకు రికార్డుల ప్రకారం అన్ని కరెక్ట్‌గానే ఉన్నాయి. కస్టమర్ అనుమానం వ్యక్తం చేయడంతో సతీష్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా సమాధానం దాటేవేసి అదృశ్యమయ్యాడు. రికార్డులో సరిగాఉన్న ఆభరణాలు కనిపించకపోవడంతో పలువురు కస్టమర్లు సాలడి భాస్కర్, సూర్యకుమారి, బొమ్మిశెట్టి గోపిచంద్ తదితరులు అప్రైజర్ చేసిన మోసంపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే అరిపాక సతీష్‌కుమార్ చేసిన మోసాలను గుర్తించిన బ్యాంకు మేనేజర్ మహమ్మద్ అస్మతుల్లా బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సైబర్ క్రైం 'సెప్టెంబరు'..59మంది అరెస్ట్

**- రూ.86,64,827లు బాధితులకు అందజేత**

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త**

సైబర్‌నేరాల అంతకంతకు పెరుగుతున్నాయి. కొత్తరకంగా మాటలు కలుపుతూ బోల్తా కొట్టిస్తున్నారు సైబర్ నేరస్తులు... విద్యావంతులు సైతం వారి వలలో చిక్కుకుని ఆర్థికంగా విలవిలలాడుతున్నారు. సైబర్ నేరాల కట్టడికి నగర సైబర్ క్రైం ముమ్మర చర్యలు చేపట్టి నేరస్తుల ఆటకట్టిస్తున్నారు. గత నెల సెప్టెంబరులో 320 కేసులపై ఫిర్యాదులు అందగా.. రంగంలోకి దిగి దేశంలోని ఆయా రాష్ట్రాల సైబర్ నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.80,64,827లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. పెట్టుబడి మోసాలు 28 ఉండగా... డిజిటల్ అరెస్టలు-6, పార్ట్‌టైమ్ పెట్టుబడులు-4, మ్యాట్రిమోనియల్-2, క్రెడిట్‌కార్డులు-4, సినిమా పైరసి-3, ఉద్యోగాలు-1, ట్రేడింగ్-1, సోషల్‌మీడియాల మోసాలు4తో పాటు టిప్‌లైన్, అనధికార లావాదేవీల మోసాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్-9 మంది ఉండగా అస్సాం- 02, బీహార్-04, ఢిల్లీ -12, గుజరాత్ -15, హర్యానా- 04, హిమాచల్ ప్రదేశ్ - 02, జమ్మూకాశ్మీర్- 02, జార్ఖండ్- 03, కర్ణాటక- 38, కేరళ- 06, మధ్యప్రదేశ్ - 03, మహారాష్ట్ర - 53, మేఘాలయ- 01, ఒడిశా- 02, పంజాబ్ -02, రాజస్థాన్ -04, తమిళనాడు- 07, ఉత్తరప్రదేశ్ - 09, ఉత్తరాఖండ్- 02, పశ్చిమ బెంగాల్- 03, తెలంగాణ-74 మంది నిందితులకు 257 కేసులలో ప్రమేయం ఉన్నట్లు తేలిందని సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు. అయితే ఐదుగురికి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బీహార్‌కు చెందిన అశ్వని కుమార్.(21), తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్నెంట్ రాజ్ అమలాదాస్(32), ఏపి వనస్థలిపురానికి చెందిన జాన కిరణ్ కుమార్ (29), తమిళనాడుకు చెందిన సుధాకరన్ (31), బీహార్‌కు చెందిన అర్సలాన్ అహ్మద్ (31)లు ప్రధాననిందితులుగా ఉన్నారు. వారి నుంచి పలు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఐఓలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నేరాలకు ఉపయోగించిన టాబ్లెట్, హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, డాంగిల్స్, పెన్ డ్రైవ్‌లు, వెబ్ క్యామ్, మెమరీ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ సైబర్ మోసానికి ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందారు మరెందరో బాధితులు ఆర్థికంగా నష్టాపోయామని ప్రాణాలొదిసినట్లు వివరించారు.



మాట్లాడుతున్న డిసిపి రష్మిపెరుమాల్

## క్రాకర్స్‌షాప్స్ యజమానులు నిబంధనలు పాటించాలి

**డిసిపి రష్మిపెరుమాల్**

**కంటోన్మెంట్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** దీపావళి పండుగ సందర్భంగా క్రాకర్స్ విక్రయించే నిర్వాహకులు షాప్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని ఉత్తర మండలం డిసిపి రష్మిపెరుమాల్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ డిసిపి కార్యాలయంలో క్రాకర్స్ నిర్వాహకులతో సమావేశమైయ్యారు. దీపావళి సందర్భంగా క్రాకర్స్ షాప్‌లు ఏర్పాటు చేసుకునేందుకు జిహెచ్‌ఎంసి, కంటోన్మెంట్ బోర్డు నుంచి అనుతులు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటుచేసుకుంటే స్థల యజమాని నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలన్నారు. అదేవిధంగా అగ్నిమాపక అధికారి, పోలీసుల నుంచి అనుమతి తీసుకొని క్రాకర్స్ షాప్‌ల నిబంధనలు పాటించాలన్నారు.

# హక్కుల సాధనలో ముదిరాజ్‌లకు అండగా ఉంటా

**కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి**

**సికింద్రాబాద్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నియోజకవర్గంలోని నామాలగుండులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ సికింద్రాబాద్ ముదిరాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులకు పూర్తిగా అండగా ఉంటామని. వారికి అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తామని. అందరూ ఐక్యమత్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అన్నదమ్ముల సోదర భావంతో గ్రామాల్లో మంచి వాతావరణంలో ముదిరాజులు సాహసపెతమైన జీవితం గడిపారని వారు వెనుకబడిన తరగతులు అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని కిషన్ రెడ్డి ఈటల రాజేందర్‌లు సూచించారు. వారికి దక్కవలసిన చట్టసభల , స్థానిక సంస్థల రాజకీయ గౌరవం తప్పకుండా దక్కే విధంగా మేము అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ ముదిరాజ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, సుక్క గణేష్ ముదిరాజ్, సంజీవి ముదిరాజ్, సతీష్‌రాజ్, శంకర్ ముదిరాజ్, నాగేష్ ముదిరాజ్, మేకల సారంగపాణి, కనకట్ల హరి, రమేష్, మేకల కీర్తి హర్ష కిరణ్, శ్రీనివాస్, విజయ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్, మేకల లక్ష్మణ్, లల్లు ముదిరాజ్, పిట్ల నాగేష్, హనుమంతు ముదిరాజ్, హరిదాస్ పిట్ల, రాజేష్ ముదిరాజ్, నేతాజీ, నరేష్ ముదిరాజ్, కుమారస్వామి, సురేష్ ముదిరాజ్, కనకయ్య ముదిరాజ్, బిక్ష ముదిరాజ్, మధు ముదిరాజ్, ప్రవళిక, మాజీ కార్పొరేటర్ మేకల సుజాత, కాంతమ్మ, సుజాత, లావణ్య, ఇందిరా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో జరిగిన అవగాహన రన్ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పాల్గొని, క్యాన్సర్ అవగాహనపై మాట్లాడారు. ప్రభాతవార్త, హైదరాబాద్

# ఇక్కడ ఉంటాం.. అక్కడా ఉంటాం..!

**ప్రభుత్వ వైద్యుల ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సేవలు.. సమయపాలన పాటించకున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు**

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :**
ఇక్కడా ఉంటాం.. అక్కడా ఉంటాం.. ఇదీ ప్రభుత్వ వైద్యుల తీరు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూనే కాసుల కోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ దర్శనమిస్తున్నారు. మరికొంత మంది వైద్యులు మరో అడుగు ఌందుకేసి ఓపీలోని కొంత మందిని తమ సొంత క్లినిక్, ఆసుపత్రికి మళ్లిస్తున్నారు. ఇది జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధం. అయినా ఆ శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఓపీకి వచ్చే వందలాది రోగులను తూతూమంత్రంగా విచారించి పంపుతున్నారు. ఫలితంగా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రు లపై ఉన్న చులకనభావం బలపడుతోంది.



**ఓపీ నుంచి సొంత క్లినిక్‌లకు...**

గ్రేటర్ పరిధిలో గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, సరోజని, ఈఎన్‌టీ, ఛాతీఆసుపత్రి, ప్లేట్ల బురుజు, ఫీవర్ ఆసుపత్రి, సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ఆసుపత్రి, మానసిక ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైద్య, విధాన పరిషత్ పరిధిలోని కింగ్ కోఠి, కొండాపూర్, మలక్‌పేట్, నాంపల్లి, గోల్కొండ, వనస్థలిపురం, బార్కాస్, డబీపూర, సీతాఫల్‌మండీ, అంబర్‌పేట్ తదితర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సుమారు 3వేలకు పైగా వైద్యులు, టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. ఇందులో కొంతమందికి సొంతంగా క్లినిక్‌లు ఉండగా, మరికొంత మంది ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో కన్సల్టెంట్, ఆన్ కాల్‌పై వైద్య సేవలందిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో గైనిక్, పీడియాట్రిక్, కిడ్నీ, గుండె, డయాబెటిక్, ఆర్థోపెడిక్ తదితర కీలక విభాగాల వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీకి వచ్చిన రోగులను తమ సొంత క్లినిక్‌లకు రావాలని సూచిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లతో ఒప్పందం..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బందితో ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారు. రోగులకు అవసరం ఉన్నా, లేకున్నా కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అవి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేవని, బయట చేయించుకోవాలని పంపిస్తున్నారు. దీంతో రోగులు ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్రాలకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

**సమయపాలన ఏదీ..?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమయపాలన ఉండటం లేదు. ఉదయం పది గంటలు దాటిన తర్వాత కూడా వైద్యులు విధులకు వస్తుంటారు. ఉదయం 8 గంటల నుంచి ఓపీ చీటీ కోసం లైన్‌లో నిలబడి, తర్వాత వైద్యుడి కోసం ఎదురుచూసిన రోగులను ఒక్క నిమిషంలో విచారించి పంపిస్తున్నారు. పీహెచ్‌సీ, క్లస్టర్, ఇతర ఆసుపత్రుల్లో ఓపీలో గంట నుంచి గంటన్నర మాత్రమే ఉంటున్నారు. మరికొంత మంది ముందుగానే సెలవు చీటీ రాసి ఇస్తున్నారు. ఎవరైనా ఆకస్మిక తనిఖీకి వస్తే సెలవు చీటీ పని చేస్తుంది. లేదంటే డ్యూటీకి వచ్చినరోజు మిగిలిన అన్ని రోజులకు కలిపి ఒకేసారి సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# మాణిక్ జువెలర్స్ దంపతులపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదు

**- 224 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 7 లక్షలు మోసపోయిన మహిళ**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** బంగారు ఆభరణాల దుకాణం పెట్టి డబ్బుల వసూళ్లు చేసి బిచాణా ఎత్తేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన భువనేశ్వరి, చైతన్య దంపతులకు ఫిల్మ్‌నగర్‌లోని మాణిక్ జువెలర్స్ యజమాని మాణిక్‌చౌదరి, భార్య సుచీతో పాతపరిచయం ఉంది. వ్యాపార విస్తరణ కోసం డబ్బులు కావాలంటూ ఒత్తిడి చేయడంతో ఏడాది కిందట భువనేశ్వరి 224 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 7 లక్షల నగదును వారికి ఇచ్చింది. కొద్ది రోజుల కిందట ఫిల్మ్‌నగర్‌లోని దుకాణానికి వెళ్లి చూడగా దుకాణం మూసి కనిపిచింది. ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా మాణిక్‌చౌదరి నుంచి అతని భార్య నుంచి ఎలాంటి స్పందన లేదు. తనను మోసగించారని భువనేశ్వరి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్లో మాణిక్ జువెరల్స్ యజమానిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు గుర్తించారు. బాధితుల సంఖ్య మరింత పెరిగేలా కనిపిస్తుంది.

# కుమార్తె వయసున్న ఉద్యోగితో అసభ్య ప్రవర్తన

**-సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** కుమార్తె వయసున్న ఉద్యోగితో అసభ్యంగా ప్రవర్తించిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ ప్రాంతంలో నివసించే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి(26) ఒక ఎంఎన్‌సీ సంస్థలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తుంది. 2023లో సంస్థలో కొత్త బృందంలో చేరినప్పుడు సీనియర్ భాగస్వామి అయిన మృణాల దాస్ (51)తో పరిచయం ఏర్పడింది. ఆమెతో ఏర్పడిన పరిచయం నేపథ్యంలో కుమార్తెలో చూడటమే కాకుండా సత్ప్రవర్తనతో ఉండేవాడు. జులైలో ఇద్దరు కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 72లోని 'ది ఫిఫ్త్ ఎలిమెంట్ స్పా'కు మర్ధన కోసం వెళ్లారు. ఇద్దరికి వేర్వేరుగా మర్ధన చేస్తారని మృణాల దాస్ మాటలను నమ్మి వెళ్లిన ఆమె మర్ధన సమయంలో నిద్రలోకి జారుకొంది. అనుకోకుండా ఆమెకు వెనుక నుంచి వేరే చేతులు తగలడంతో ఉలిక్కిపడిన ఆమె చూడగా మృణాల్‌దాస్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించింది. యువతి కేకలు వేయడంతో అతను అక్కడి నుంచి బయటకు వెళ్లాడు. మళ్లీ రావడానికి ప్రయత్నించగా యువత అరుపులతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్ కాల్స్‌లోనూ ఆమెతో అనుచితంగా, అమర్యాదగా మాట్లాడటం ప్రారంభించాడు. మృణాలదాస్ లండన్‌లో ఉన్న సమయంలో వీడియో కాల్ చేసి 'భారత్‌కు వచ్చాక గోవాకు వెళ్దాం, బాత్ సూట్ వేసుకో, ప్రైవేటు బీచ్‌లో కలుద్దాం' అంటూ ఆమెతో అమర్యాదగా మాట్లాడాడు. సంఘటనను ఆమె సంస్థ హెచ్‌ఆర్ బృందానికి ఫిర్యాదు చేసింది. అయితే మృణాల్‌దాస్‌తో ఉన్న భయంతో సదరు ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# యువకుల ప్రాణాలు తీసిన ఈత సరదా

**ఇద్దరు యువకులు గల్లంతు.. మృతదేహాలు వెలికితీత**

**అత్తాపూర్ అక్టోబరు 12 ప్రభాతవార్త:**

సరదాగా గడుపుదామని వచ్చిన ఇద్దరి యువకుల ప్రాణాలను ఈత సరదా తీసింది. ఈ ఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ వివరాల ప్రకారం... ఆదివారం సెలవు కావడంతో హసన్ నగర్ కు చెందిన సోహన్ (16). రేహాన్ (15)లతో పాటు నలుగురు స్నేహితులతో కలిసి బుద్వేల్ జన చైతన్య కాలనీ సమీపంలోని ఈసీ నది మొండి కత్వా వద్దకు వచ్చారు. సరదాగా ఈత కొట్టేందుకు సోహన్, రేహాన్ లు నదిలోకి దిగారు. ఐతే ఈత రాక పోవడంతో నీటిలో మునిగి మృతి చెందారు. తోటి స్నేహితులు భయంతో పారి పోగా గమనించిన స్థానికులు 100 నెంబరు డయల్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు మృతదేహాలను వెలికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న సిటీ సివిల్ కోర్టు జడ్జి కిరణ్మయి

## బోయిన్‌పల్లిలో మానసిక ఆరోగ్య దినోత్సవం

**కంటోన్మెంట్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** మానసిక వికలాంగులకు, బుద్ధిమాంధ్యులకు తగిన ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సిటీ సివిల్ కోర్టు, జిల్లా న్యాయసేవ అథారిటీ కార్యదర్శి, సీనియర్ జడ్జి కిరణ్, కిరణ్మయి అన్నారు. మానసిక ఆరోగ్య దినాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లిలోని ఎన్ఐ ఇపిఐడీలోని మానసికవికలాంగులకు ఆరోగ్య ప్రోత్సాహాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయ బృందం ప్రతినిధులు జగదాంబ, బి.సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజంలో భాగస్వాములవుదాం



పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజంలో భాగస్వాములు కావాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా ఆయన ముషీరాబాద్ యూపీహెచ్‌సీ కేంద్రంలో ఐదు సంవత్సరాలలోపు వయసు ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు వయసున్న ప్రతి చిన్నారికి, తల్లి తండ్రులు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని, ఈ రెండు చుక్కలే పోలియో మహమ్మారిని ఎదుర్కొనే బలమైన ఆయుధాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంగీతం ఒక మంచి ఔషధం

### ప్రముఖ సంగీత గురువు తాడేపల్లి సాయిప్రసాద్



తాడేపల్లి సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

**ముషీరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** సంగీతం ఒక మంచి ఔషధం అని ప్రముఖ సంగీత గురువు తాడేపల్లి సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సగేరా మ్యూజిక్ స్టూడియోలో స్వరాలాపన ఆధ్వర్యంలో సీజన్ 12 పేరుతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. దేవి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులే కాకుండా నందిగామ, గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, మార్కాపురం, తిరుపతి, అనంతపురం ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు ఉత్సాహంగా పాటలు గానం చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగిన ఈ సంగీత కార్యక్రమానికి గాయకులు మార్కుపూడి ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, అనంత ఘంటసాల ఆరాధనా సమితి సభ్యులు జి.వి.రామయ్య, పి.నాగరాజు, కే.సుదర్శన్‌బాబు, కే.మహీధర్, ఉమాదేవి తదితరులు తమ గానంతో ఆహుతులను అలరించారు. అనంతరం నిర్వాహకులు, గాయకులు సాయిప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## నామినేటెడ్ సభ్యురాలికి ఘన సన్మానం



బానుక నర్మదను సన్మానిస్తున్న బస్తీ ప్రజలు

**కంటోన్మెంట్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 6వ వార్డ్ టార్బండ్ బజార్ ప్రాతంలో కంటోన్మెంట్ బోర్డ్ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్తీవాసులు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్‌ను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బానుక నర్మద మాట్లాడుతూ సమస్య ఉంది అని తెల్పిన వెంటనే స్పందించి అన్ని విధాల సహకరిస్తూ రాబోయే రోజుల్లో మన కంటోన్మెంట్‌ను సమస్య రహిత కంటోన్మెంట్‌గా తీర్చి దిద్దడం కోసం కృషిచేస్తున్నరని, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాణాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, వినోద్, అజీజ్, నరేష్, అన్నూ, విజ్జూ, జహంగీర్, అక్షయ్, లడ్డూ, రాకేష్, శివ పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఈ నెల 13న రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్స్‌ను ఆదివారం పరిశీలించిన వారు మీడియాతో మాట్లాడుతూ 13(నేడు)న ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బూత్‌స్థాయి నాయకులతో ఈ సమావేశం జరుగుతుందని, అయిదువేల మంది హాజరవ్వనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా కేటీఆర్, మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత హాజరవుతారన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రవీందర్‌రావు, వినయ్‌భాస్కర్

# ప్రతి విద్యార్థికీ లక్ష్యం ఉండాలి : సోనియాగుప్తా



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి లయన్ సోనియా గుప్తా

**హైదరాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ప్రతీ విద్యార్థి తన జీవితంలో ఒ లక్ష్యం ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి లయన్ సోనియా గుప్తా స్పష్టం చేశారు. పద్మారావునగర్ జ్యోతి మోడల్ హైస్కూల్లో వ్యక్తిత్వ వికాస సెషన్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతూ వారి లక్ష్యాలను ఎలా సాధించాలో గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరి జీవిత వికాసంలో వ్యక్తిత్వం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఒక వ్యక్తి సంభాషించే విధానం, వివిధ పరిస్థితులకు వారు స్పందించే విధానం, అలాగే ఇతరులతో వారు సంభాషించే విధానం వంటి లక్షణాలను అవగతం చేసుకోవాలన్నారు. ఏ వృత్తి అయినా సరే సదరు వ్యక్తి పనితీరు వారు తమను తాము ఎలా ప్రవర్తిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి ఎల్లప్పుడూ చెడు వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి కంటే మంచిగా రాణిస్తాడన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగటానికి ప్రతీ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసాన్ని బోధించడం చాలా ముఖ్యమని వివరించారు. వ్యక్తిత్వ వికాస సెషన్ల నుండి అటు విద్యార్థులు ఇటు ప్రొఫెసర్లు ఇద్దరికీ వారి జీవితంలో ప్రయోజనం చేకూరుతుందన్నారు. విజయం సాధించడానికి సెషన్లు ఎలా సహాయపడతాయన్న అంశంపై లయన్ సోనియా గుప్తా వివరించారు. వ్యక్తిత్వ వికాసం ద్వారా సమస్యలను అధిగమించడంతో పాటు ఇతరులకు సహాయపడే గుణం, ప్రతీ విషయంలో సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఒక వ్యక్తి తన ప్రవర్తనా తీరును వివిధ మార్గాల ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చు, వాటిలో ముఖ్యమైనది వ్యక్తిత్వ వికాసమేనన్నారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సెషన్ల ద్వారా వారి ఎంచుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకునే తత్వాన్ని పెంపొందించ కోవచ్చన్నారు. వ్యక్తిత్వ వికాసమన్నది ప్రతి పరిస్థితిలోనూ మంచిని చూడటానికి మరియు ప్రతి మేఘంలో వెండి రేఖను కనుగొనడానికి సహాయపడుతుందని వివరించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాస సెషన్లు వ్యక్తిత్వ నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని లయన్ సోనియా గుప్తా తెలిపారు. విద్యార్థులు వారి ఆలోచనలు, భావాలు, ప్రవర్తన గురించి మరింత అవగాహన పొందడానికి ఈ సెషన్లు సహాయపడతాయన్నారు. ప్రతీ విద్యార్థి తన అంతర్గత పనితీరు గురించి అవగాహన పెంచుకున్నప్పుడు, వారి వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచే మార్పులను ప్రారంభించవచ్చని తెలిపారు. మెరుగైన సామాజిక నైపుణ్యాలు, సానుకూల సంబంధాలు, సమయ నిర్వహణ, ఆత్మగౌరవం అలవర్చుకునేం దుకు వ్యక్తిత్వ వికాస సెషన్లు సహాయకారిగా ఉంటాయన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

### మాలమహానాడు మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నియామకం

**జగద్గిరిగుట్ట, అక్టోబరు 12, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట 126 డివిజన్ పరిధిలోని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజేష్ మన్నే వెంకటేష్‌ను మండల అధ్యక్షుడిగా, నాగూర్ విజయ్ కుమార్‌నుప్రధాన కార్యదర్శిగా ఆర్‌సిపురం, సంగారెడ్డి జిల్లాగా నియమించారు. మీ నాయకత్వం సమాజానికి ఐక్యత, సాధికారత న్యాయాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

## ఓటు ద్వారానే సమాధానం చెప్పాలి

### తెలంగాణ కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి

**చిక్కడపల్లి అక్టోబరు 12 ప్రభాతవార్త:** ఓటు ద్వారానే అగ్రకులాల వారికి సమాధానం చెప్పాలని తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జూబ్లిహిల్స్ ఉపఎన్నికల పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి హామీలను ఇస్తు అధికారంలోకి రాగానే వాటిని విస్మరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలంతోపాటు ఫెన్షన్, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ప్రధాన పార్టీలన్ని డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇట్టి విషయం పై బీసీ మంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. బహుజనులంతా ఐక్యమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బొగ్రమోని పురుషోత్తం, తెలంగాణ బహుజన ముక్తి పార్టీ అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రఫుల్ రామిరెడ్డి, రవిప్రసాద్, ముద్రబోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దసరా మిలాప్

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని ఎస్ఆర్టి కమ్యూనిటీ హాల్లో దసరా మిలాప్ కార్యక్రమం ఆదివారం జరిగింది. బిఆర్ఎస్ రాష్ట్రనేత ఎం.ఎన్.శ్రీనివాసరావు కార్పొరేటర్ రచనశ్రీ, హాజరయ్యారు. ఐక్యవేదిక మీడియా కన్వీనర్ గజ్జల సూర్యనారాయణ, కేశపురం స్వామి, గండి కృష్ణ, కన్వీనర్లు రూపుల వివేక్, చిట్టి శ్యాంసుందర్, ముషీరాబాద్ అధ్యక్షులు జివైగిరి, గద్దం నవీన్, ఎం భాస్కర్, గోపాల్ దాస్, నవీన్, ఎర్రోళ్ల సతీష్, హరీష్, నర్సింగరావు, గండి కృష్ణ స్వామి, గద్దం రమేష్, హరీష్, జి.నరేష్ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

## సాహితీ, కళామతల్లికి ముద్దుబిడ్డ అడవి బాపిరాజు

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆదివారం దాశరథి థియేటర్‌లో కిన్నెర చిత్ర 'అడవి బాపిరాజు' లఘుచిత్ర ప్రదర్శన కార్యక్రమం జరిగింది. మద్దాళి రఘురామ్ నిర్మాతగా, రచన, దర్శకత్వం పి.వి.చలం ద్వారా రూపొందించిన ఈ ప్రదర్శనకు అద్భుత స్పందన లభించింది. వెంకటరావు, నటులు సుబ్బారావు పాల్గొన్నారు. వీటితో పాటు లక్కి, మదులిక, ప్రదర్శించారు. కార్యక్రమం అనంతరం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మేనేజింగ్ ట్రస్టీ వినయ్‌కుమార్, గోపాల్ ప్రసంగించారు. బిడిఎల్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అడవి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, నవలా రచయిత చిత్రకాళాకారుడు స్వతంత్ర సమరయోధుడుగా సుపరిచితులుఅని వక్తలు పేర్కొన్నారు. సాహితీ, కళామతల్లికి ముద్దుబిడ్డ అడవి బాపిరాజు అని, తన ప్రతిభతో తెలుగు సాహితీ కళామతల్లి ప్రతిష్టను ప్రపంచం నలుమూలల వ్యాపింపజేసిన గొప్ప తేజోమూర్తి అని కీర్తించారు.



మాట్లాడుతున్న నవీన్‌యాదవ్

## సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా : నవీన్‌యాదవ్

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ స్పష్టం చేశారు. ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని శ్రీసాయిశ్రీనివాస అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన మీటింగ్‌లో పాల్గొన్న ఆయన కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను తీర్చేందుకు ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ డైరీ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి మాట్లాడుతూ నవీన్‌యాదవ్‌ను నియోజకవర్గం ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారని, ప్రతి పాదయాత్రలో ఇది ప్రజల నుంచి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఆర్య వైశ్య సంఘం

### ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్త



టిటిడి ఆలయంలో స్వామివారి కళ్యాణం నిర్వహించిన ఆర్యవైశ్యులు

**హైదరాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ఇసామియాబజార్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆదివారం హిమాయత్‌నగర్‌లోని టిటిడి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించింది. ఇసామియాబజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణానికి ఆది మూలపు బాలకృష్ణ ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు కొమరిశెట్టి అనిల్‌కుమార్, గాజుల మహేష్‌గుప్త, నితీష్, జి.మురళికృష్ణ, విక్రం తదితరులు పాల్గొన్నారు. సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్త ఈ సందర్భంగా అన్నారు. అధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

### రామాయణం, సుందరకాండం సప్తపదుల సంపుటి ఆవిష్కరణ

**చిక్కడపల్లి అక్టోబరు 12 ప్రభాతవార్త:** మహిత సాహితి శ్రీత్యాగరాయ గాన సభ సంయుక్త అధ్వర్యంలో సత్యవతి దినవహి రచించిన సంక్షిప్త రామయణం, సుందరాకాండం సప్తపదుల సంపుటి ఆవిష్కరణ ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు వేదికలో జరిగింది. సప్తపది సృజనకర్త సుధామ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కథా, రచయిత విమర్శకులు, కవి విహారి ఆవిష్కరించి సాహిత్య విలువల గురించి చక్కని విషయాలు ప్రస్తావించారు. సుందరీ నాగమణి పుస్తకాన్ని జన రంజకంగా సమీక్షించారు. రచయిత్రి తన సాహితీ ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు. మహితసాహితి అధ్యక్షురాలు శ్రీపాద స్వాతి, కార్యదర్శి శిష్టా మాధవి కర్యక్రమాన్ని నిర్వహించారు. అధక్ష యలు సప్త పదుల ఉధ్భవం గురించి వేగంగా విస్తరిస్తూ పుస్తకాలు పుస్తకాలుగా వ్యాప్తి చెందడం గురించి చెప్పారు. ఈకార్యక్రమం మాధవి వందన సమర్పణతో ముగిసింది.

### ఫుట్‌పాత్‌పై నివసించేవారికి ఆహారం పంపిణీ

**ముషీరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఫుట్‌పాత్‌పై జీవిస్తున్న నిరాశ్రయులకు శాశ్వత ఆశ్రమం కల్పించాలని స్కైఫౌండేషన్ అధ్యక్షుడు వై. సంజీవ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌పై నివసించే వారికి ఆహారం అందించారు. ఈ సందర్భంగా సంజీవ కుమార్ మాట్లాడుతూ కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తే నిరాశ్రయులు లేని రాష్ట్రం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు ఓ.పావని, సభ్యులు రేవంత్, శుభం, రణధీర్‌గౌడ్, కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# నాటక సమితి సాంస్కృతిక రంగ కృషి అపూర్వమైంది

### -రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు వసుంధర





సునాద వినోదిని పేరుతో ఒక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబరు 12 ప్రభాతవార్త:** 1961 నుంచీ ఆరున్నర దశాబ్దాలకు పైగా, జాతీయ స్థాయిలో శాస్త్రీయ సంగీత నృత్య పోటీలను నిర్వహిస్తూ, యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్య నాటక సమితి సాంస్కృతిక రంగ కృషి అపూర్వమైనదని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో నవ్య నాటక సమితి వారు అఖిల భారత సంగీత నృత్య పోటీల స్వర్ణోత్సవ సందర్భంగా సునాద వినోదిని పేరుతో ఒక ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గత సంవత్సరాలలో ఈ పోటీలలో బహుమతులు గెల్చుకున్న 50 మంది సంగీత, నృత్య రంగ ప్రముఖులను ఒక వేదికపైకి చేర్చి అందరినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జి. వసుంధర ముఖ్య అతిధిగా హాజరై, గౌరవ అతిధులుగా కార్యక్రమములో పాల్గొన్న ప్రముఖులు తాడేపల్లి శ్రీనివాస్, రజిత్ కుమార్ అకులతో కలిసి సంగీత నృత్య కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. సత్కారాలందుకున్న సంగీత నృత్య రంగాల ప్రముఖులు బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాధ శర్మ, నెమలికంటి సువర్ణలత, జి. ప్రకాష్, జొన్నల గడ్డ అనురాధ, పాండురంగ్ ముతాలిక్, కల్పనా కిషోర్, గీతాగణేశన్, ఎం.శ్రీనివాస్, సంజయ్ కుమార్ జోషి తడితరులు నవ్యనాటక సమితి సంస్థాతో తమకున్న అనుభవాన్ని పంచుకున్నారు. నవ్య పోటీల ప్రయోజనాలను వివరించారు. నవ్యనాటక సమితి సంస్థ ప్రముఖులు నిష్టల సుధామాల, డా. ఇందిరా హేమ, మధుమతి కులకర్ణి లు కార్యక్రమాన్ని ఆద్యంతమూ ఆసక్తికరంగా, చక్కగా నిర్వహించారు. సమితి అధ్యక్షులు వేమరాజు విజయ కుమార్ స్వాగతం పలికారు. జంటనగరాల ప్రముఖ కళాకారులు ఈ కార్యక్రమములో పాల్గొని, సభకు నిండుదనాన్ని తెచ్చారు.



మాట్లాడుతున్న కట్టెల శ్రీనివాస్‌యాదవ్

## జూబ్లీహిల్స్‌ఎన్నికల్లో నవీన్‌యాదవ్‌కు మద్దతు

### కట్టెల శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట, అక్టోబరు 12 ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు తెల్పడంతోపాటు భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర యాదవ సేన చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కట్టెల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో గెలిచే వ్యక్తికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐ సీసీ ఇంచార్జి ఖర్గే, పీసీసీ మహేష్ కుమార్ గౌడ్‌లు కాంగ్రెస్ టికెట్ ఇచ్చారని తెలిపారు. బిసి వర్గానికి చెందిన యాదవ బిడ్డను గెలిపించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో 15 వేల యాదవుల ఓట్లు ఉన్నాయన్నారు యాదవ బిడ్డకు టికెట్ ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సేన నాయకులు పెండెం శ్రీనివాస్ యాదవ్ కిషన్ యాదవ్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ మేకల శంకర్ యాదవ్ నీలం శ్రీనివాస్ యాదవ్ శ్రీధర్ యాదవ్ ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 14న జెబిఎస్‌లో కార్గోపార్శిల్ వస్తువుల వేలం

**కంటోన్మెంట్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ లోని కార్గో పార్శిల్‌లో గత డిసెంబర్ నుంచి 2025 జూలై వరకు వచ్చిన వస్తువులను కస్టమర్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించినా వారి వస్తువులను తీసుకెళ్లకపోవడంతో ఆ వస్తువుల విలువ 50 శాతం పై వేలం వేస్తున్నామని ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (లాజిస్టిక్స్) ఇషాక్ బిన్ మహ్మద్ తెలిపారు. ఆ వస్తువులపై ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మధ్యాహ్నం1 గంట నుంచి 5 గంటల వరకు జెబిఎస్‌లోని ప్లాట్ ఫారం నెం 14 కార్గో కౌంటర్ వద్ద వేలం వేయనున్నట్లు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

**సికింద్రాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లైఫ్ స్ప్రింగ్ మెటర్నటి హాస్పిటల్ చిలకలగూడ సౌజన్యంతో వారాసిగూడ గంగపుత్ర సొసైటీ భవనంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ప్రత్యేకించి మహిళల కోసం ఈ క్యాంపు నిర్వహించడంతో 150 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో బిపి షుగర్ బ్లడ్ టెస్టులతో పాటు గైనిక్ సమస్యలపై ట్రీట్మెంట్ వైద్య చికిత్సలు అందజేశారు. అవసరమైన మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తామని, ఇందులో ప్రత్యేకించి పేద మహిళలు లబ్ది పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో దామిన సదానంద, వంగల సుధాకర్, జిజుల సునీల్, చల్లూరి సంజీవ్, అంబటి రమేష్, ముద్రగడ శివ, కర్మకొండ విశాల్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేత

**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** రెండు సంవత్సరాల క్రితం జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే వడ్డే చంద్రశేఖర్ తండ్రి వడ్డే నర్సింహులు, రాజీవ్ గృహకల్పలో కరెంట్ పనిచేస్తుంటుండగా ఇనుప నిచ్చెనకు 11 కె.వి లైన్ తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పిస్తూ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన 5 లక్షల రూపాయల నష్ట పరిహార చెక్కును ఆదివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, నాయకులు వేమా రెడ్డి, ఈ.వెంకటేష్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

## నటీమణి అన్నపూర్ణకు అక్కినేని పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి అక్టోబరు 12 ప్రభాతవార్త:** అభినందన సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ ఆధ్వర్యంలో సుప్రసిద్ద సినీనటులు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 'అభినందన' అక్కినేని పురస్కారం'ను సినిమాలకే అమ్మగా పేరుపొందిన ప్రముఖ నటీమణి అన్నపూర్ణకు ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి డాక్టర్ ఇ.భవాని వివరించారు. పద్నాల్గవ తేదీన చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఎపి అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆధ్యాత్మిక గాయనీ, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ శోభరాజు చేతులమీదుగా పురస్కారాన్ని అందించడం జరుగుతుందని, కార్యక్రమంలో సుప్రసిద్ద ఆధ్యాత్మిక రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, జివిఎన్.రాజు, సుంగమం సంజయ్‌కిషోర్ తదితరులు పాల్గొంటారన్నారు. అక్కినేని నటించిన చిత్రాలకు సంబంధించిన క్లిప్పింగ్స్ ప్రదర్శన ఉంటుందని, ఏఎన్నార్ నటించిన చిత్రాల నుంచి గీతాలను నందూరి లక్ష్మణ్‌రావు, శివవదన గానం చేస్తారన్నారు. రాధికా శ్రీనివాస్ శిష్యబృందం ఆధ్వరనయంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం డిమాండ్

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచి సామాన్యులను దోచుకుంటున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నేతలు జిల్లోజు హేమ సుదర్శన్, రమ్యగౌడ్, జి. సునీత డిమాండ్ చేసారు. పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్, ఆర్టీసీ ఎక్స్ రోడ్స్, బస్సు భవన్‌వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా హేమసుదర్శన్ మాట్లాడుతూ ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి ఏనాడూ బస్సు చార్జీలు పెంచలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పురుష ప్రయాణికుల దగ్గర రెట్టింపు బస్సు చార్జీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని హేమ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆప్ నేతలు ఎండి. ఫైసల్. అజీమ్ బేగ్, ఎహసాన్ అబ్బాస్ పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈవి మునిశేఖర్‌కు బస్సు చార్జీలను తగ్గించాలని వినతిపత్రం అందజేశారు.

## శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధానవేదికపై ఆదివారం పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితచరిత్ర సంఘం శరణం గచ్ఛామి పేరిట నాటక ప్రదర్శన జరిగింది. దేవేంద్ర రచించగా, జగ్గరాజు దర్శకత్వం ప్రదర్శించారు. అంబేద్కర్ చిన్న నాడు ఎదుర్కొన్న వివక్షత మహారాజు సహకారంతో లండన్ అమెరికాలో ఉన్నత విద్య చదివినా తప్పనీ అంటరానితనం, మహమ్మారితో ఉద్యమించిన నేపధ్యం ఆసక్తిగా ప్రతి దృశ్యం లో ఆవిష్కరించారు. స్వాతంత్ర పోరాటం లో సందర్భంలో హిందువులను కులాల వారీ గా విడగొట్ట రాదు అని గాంధీజీ ఆశయం అయితే అంబేద్కర్ వివక్షత అనుభవిస్తున్నవారికి ప్రత్యేక హక్కులు ఇవ్వాలని కోరటం, వారిరురు మధ్య విభేదాలు. స్వాతంత్ర వచ్చిన తరువాత అంబేద్కర్ ప్రస్తుత దేశపరిస్థితులు వివరిస్తూ మహిళలకి హక్కులు కల్పించాలని మైనారిటీ వర్గాల ప్రజలు ప్రస్తుత పాలనలో అనుభవిస్తున్న బాధలు వంటి అంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి అర్జునరావు మాట్లాడుతూ కె కె రాజా మంచి నాటకాన్ని ప్రజల మధ్యకు తీసుకు వెళుతున్నారని అభినందించారు. మరొక సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి జె డి శీలం మాట్లాడుతూ వెనుక బడిన యువత చదువు కొన్నా బానిస మనస్తత్వం తో ఉంటున్నారని, అంబేద్కర్ కు జై కొట్టటం కాకుండా ఆయన త్యాగాలు ఆదర్శం గా తీసుకోవాలన్నారు. కె కె రాజా పర్యవేక్షణ లో జరిగిన కార్యక్రమ లో విశ్రాంత ఉన్నత అధికారులు మహీంద్ర ,అర్ సుబ్బారావు, పి ఎస్ ఎన్ మూర్తి, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నత అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రచ్చ సుభద్రారెడ్డి

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సోషలిస్ట్ పార్టీ(ఇండియా) అభ్యర్థిగా సుభద్రారెడ్డి

**సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** నవంబరులో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త, సోషలిస్ట్ పార్టీ (ఇండియా) రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గెలుపే లక్ష్యంగా తమ పార్టీ ప్రతి కార్యకర్త, నాయకులు స్పష్టమైన ప్రణాళికతో సైనికులవలే ప్రతి ఇంటింటికి వెళ్ళి విస్తృతంగా ప్రచారం చేయనున్నారని ఆమె వివరించారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని, ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తాను ఆరుసార్లు పోటీ చేయడం జరిగిందని, ఈ నియోజకవర్గం ప్రజలు, విద్యావంతులు, వ్యాపార వేత్తలు, సినిమా పరి శ్రమ కార్మికులు తదితరులు తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడతానని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎర్ర రాజేష్, పాట మహేష్, నరసింహా, సిద్దార్థ, పవన్, పాట రాజశ్రీ, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన



అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రసంగిస్తున్న జె.బి.రాజు

**సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** సుప్రీంకోర్ట ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నంను ఖండిస్తూ పలు దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం సాయంత్రం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంవరకు కొనసాగింది. ఈ సందర్భంగా గవాయ్‌పై దాడికి పాల్పడ్డ రాకేష్ కిషోర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం దళిత సేన జాతీయ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు జె.బి.రాజు మాట్లాడుతూ గవాయ్‌పై దాడి యత్నం జరగడం సిగ్గుచేటని, ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపైన జరిగిన దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడైన రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దాడి యత్నం వెనుక ఉన్న మతోన్మాద శక్తుల గురించి బహిరంగంగా ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యల చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో వివిధ దళిత సంఘాల నేతలు నల్ల సూర్యప్రకాష్, గంటా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీభాగ్యలక్ష్మీ మందిరంలో దీపావళీ మహోత్సవాలు



సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న శశికళ

**చార్మినార్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరంలో జరగనున్న దీపావళీ మహా మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రికను చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరం ట్రస్టీ శశికళ అందజేశారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో ఎంతో వైభవంగా దీపావళీ మహోత్సవాలను మందిరం ట్రస్టీ శశికళ వెల్లడించారు. 20వ తేదీన మందిరంలో దీపావళీ పూజ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం భక్తులకు శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారి ఖజానా పంపిణీ చేయనున్నామని ఆమె తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలియజేశారు.

### బిసి రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేస్తున్న ప్రభుత్వం

**చార్మినార్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశంపై నాటకీయ రాజకీయం చేస్తోందని బహదూర్‌పుర నియోజకవర్గం, కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చలేక రోజు, రోజుకు ప్రజలలో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేక బీసీ రిజర్వేషన్ నాటకానికి ప్రభుత్వం తెరలేపిందని ఆయన తెలిపారు. కిషన్‌బాగ్ బిఆర్ఎస్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ బీసీలపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆయన తెలిపారు.

### జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ది బెస్ట్ స్పోర్ట్స్ ఇంప్లిమెంటేషన్ స్కూల్ అవార్డు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) ది బెస్ట్ స్పోర్ట్స్ ఇంప్లిమెంటేషన్ స్కూల్ అవార్డు దక్కించుకొంది. టీ-హబ్‌లో బ్రెయిన్ ఫీడ్, స్మింక్ ప్రో అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా ఈ అవార్డును అందించారు. క్రీడలు, వెల్నెస్, ఏఐ ఆవిష్కరణలు, అత్యుత్తమ నాయకత్వ గుర్తింపుకు సూచకంగా ఈ అవార్డును రెండు రోజుల క్రితం ప్రదానం చేశారు. పాఠశాలలో వివిధ ఆటల కోసం మైదా నాలు, సింథటిక్ కోర్టులు ఏర్పాటుచేశారు. అవార్డును రిలయన్స్ జియో ఛీఫ్ డేటా సైంటిస్ట్ డాక్టర్ శైలేష్‌కుమార్, ఇండియాన్ బ్యాడ్మింటన్ టీమ్ చీఫ్ జాతీయ కోచ్ పుల్లెల గోపిచంద్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా కార్యదర్శి జయేష్ రంజన్ నుండి పాఠశాల తరుపున డైరెక్టర్ ఎం.వరలక్ష్మి అవార్డును అందుకున్నారు.

**జేహెచ్‌పీఎస్‌లో 'ఇన్నోవేట్-2025'**

విద్యార్థుల ఆవిష్కరణలు, సృజనాత్మకతలను పెంపొందించడానికి జేహెచ్‌పీఎస్‌లో ఇంటర్ డిసిప్లినరీ సవవేశాన్ని 'ఇన్నోవేట్-2025' పేరుతో నిర్వహించారు. చట్టం, వ్యాపారం, స్టెమ్, సాహిత్యం-కళలు అనే విభాగాలలో విద్యార్థుల ఆసక్తిని గుర్తించడానికి విలక్షణమైన వేదికగా ఈ వేడుకను నిర్వహించారు. ఇది ఒక అభ్యాస ఉత్సవంగా నిలుస్తుందని పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.



అవార్డును అందుకుంటున్న వరలక్ష్మి



అంబేద్కర్‌నగర్‌లో చుక్కలు వేస్తున్న సంతోష్ యాదవ్



జూబ్లీహిల్స్ లో చుక్కలు వేస్తున్న కాటూరి రమేష్



జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో పావనీ వినయకుమార్



హైదర్‌గూడా గవర్నమెంట్ స్కూల్లో సంగీత...



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మల్లేష్‌యాదవ్



పోలియో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



పాతబస్తీలో..



చుక్కలు వేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

# విజయవంతంగా చిన్నారులకు పోలియో చుక్కలు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** పోలియో రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గవర్నమెంట్ రౌండ్ టేబుల్ పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అయిదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. వైద్యారోగ్య సిబ్బంది తల్లిదండ్రులకు అవగా హన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బస్తీ దవాఖానా వైద్యుడు, సిబ్బందితోపాటు బోదాస్ నాగార్జున, కనతల బాలస్వామి, సాబన్న తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్‌నగర్‌లో...**

**అడ్డగుట్ట, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక బస్తి నాయకులు పి నర్సింగ్‌రావు శివ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్‌లో...**

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి నాయకులు శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్ మరియు నర్సు కృపా రాణి, అంగన్వాడి టీచర్ నరసమ్మ, ఆశావర్కర్లు దుర్గా, భవాని, ఆయా మాణిక్యమ్మ పాల్గొన్నారు.

**అత్తాపూర్‌లో...**

**అత్తాపూర్ అక్టోబరు 12, ప్రభాతవార్త :** పోలియో రహిత సమాజం ప్రతి తల్లిదండ్ర లక్ష్యంగా పెట్టుకోవాలి రాజేంద్ర నగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రేమావతి పెట్ ప్రభుత్వ పాఠశాలలోని పోలియో కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వినోద, ఆశావర్కర్ ఉమారాణి, సురేష్ ముదిరాజ్, భవాని దాస్, ఎడ్ల ఖాడి రవీ, తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో...**

**దుండిగల్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండుగల్ మున్సిపల్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుండిగల్ నందు మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వర్ణలతా, హాస్పిటల్ ఇన్చార్జ్ సిరాజ్, హాస్పటల్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పాతబస్తీలో...**

**చార్మినార్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** పాతనగరంలోని పలు ప్రాంతాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. దూద్‌బౌలి శాంతినికేతన్ హైస్కూల్‌లో పోలియో కార్యక్రమంలో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పాతబస్తీలోని బహదూర్‌పుర, కిషన్‌బాగ్, పురానా పూల్, గుల్జారాహౌస్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర ప్రాంతాలలో పల్స్ పోలియా కార్యక్రమం జరిగింది. జిహెచ్ఎంసి, ఆరోగ్య కేంద్రాల వైద్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సురభి హైస్కూల్‌లో...**

**చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని సురభి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో చుక్కలు మందు వేసే కార్యక్రమాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, బిఆర్ఎస్ యువనేత ముఠానరేష్, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్, కార్యదర్శి పోతుల శ్రీకాంత్, బిఆర్ఎస్ నాయకులు ఆనంద్, కుమారస్వామి, బొంతు కిరణ్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం జాన్సన్ పబ్లికేషన్స్‌లో నిర్వహించిన టాలెంట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఉపరాష్ట్ర వెంకయ్యనాయుడు తదితరులు

## చింతల్ భగత్‌సింగ్‌నగర్ సంక్షేమానికే అడ్‌హక్ కమిటీ

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘ కాలపరిమితి పూర్తయినందున బస్తీ సంక్షేమం కోసమే ఆడ్‌హాక్ కమిటీ నియమిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు ప్రకటించారు. ఆదివారం భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆడ్‌హాక్‌కమిటీ ప్రతినిధులుగా అన్నిపార్టీలు, సంక్షేమ సంఘ ప్రతినిధులు, మహిళలు, వృద్దులు, యువతను కలిపి కొత్తగా కమిటీని ప్రకటించారు. భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘానికి రెండేళ్లక్రితం ఎన్నికలు నిర్వహించగా శ్రీనాథ్ బస్తీ సంక్షేమ సంఘ అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ప్రస్తుతం కమిటీ పదవీకాలం పూర్తయి నందున ఎన్నికలు నిర్వహించేవరకు అడ్‌హాక్‌కమిటీ సంక్షేమ కార్యక్రమాల లో భాగస్వామ్యం వహిస్తుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. భగత్‌సింగ్ నగర్ సంక్షేమసంఘ అడ్‌హాక్‌కమిటీ ప్రతినిధులుగా జి.శ్రీనివాస్‌రెడ్డి, పచ్చి మట్ల నరేందర్‌గౌడ్, రవిందర్‌గౌడ్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, వరదరాజ్, ప్రేమ్‌కుమార్, నరేశ్, రాజిరెడ్డి, ఇ.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మమ్మ, ఆడ్‌హాక్‌కమిటీ సభ్యులుగా బిసు వెంకటేశ్ గౌడ్, కోడి ఆదిత్య, ఎల్లారెడ్డి, సుభాష్, బత్తిని శ్రీధర్ గౌడ్, చంద్రమౌళి, మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, దేవయ్య, భూమయ్య, వెంకటేశ్ నేత, మహ్మద్ ఇస్మాయిల్, మూర్తి, ఆంజనేయులు, రమణిలను ఆడ్‌హాక్ కమిటీగా ఎన్నుకున్నారు. రాజకీయాలకు అతీతంగా భగత్‌సింగ్‌నగర్ సంక్షేమం కోసమే అడ్‌హాక్‌కమిటీ ప్రతినిధులుగా ఎన్నుకున్నారని ప్రతినిధులు తెలిపారు.

## 15న డిబిపి అభ్యర్థి నామినేషన్ల దాఖలు

**సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థి పోటీచేస్తున్నారని, బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఇప్పటికే పార్టీ తరపున పోటీచేయడానికి పలువురు అభ్యర్థులు కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. దరఖాస్తులను పరిశీలించి సోమవారం అభ్యర్థిని ప్రకటిస్తామని చెప్పారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ల్యాండ్ మాఫియా, పొలిటికల్ సినీ మాఫియా రాజ్యం ఏలుతున్నదని, వీటిని నియంత్రణ చేసి పౌర సమాజానికి న్యాయం, రక్షణ కల్పించడం కేవలం దళిత బహుజన పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. పార్టీ అభ్యర్థికి ప్రజలు అండదండలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు షేక్ భాషా, వరదా జ్యోతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**సికింద్రాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సమీపంలో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి సమీపంలోని మెట్రో పిల్లర్ 1014 వద్ద 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండగా స్వాధీనం చేసుకొని మార్చురికి తరలించారు. మృతుడు బూడిదరంగు షర్ట్, నీలిరంగు ప్యాంటు ధరించాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.




పల్లా వెంకటరెడ్డిని సత్కరిస్తున్న ఎఐటియుసి నేతలు

## కార్మికుల శ్రమశక్తిని పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతున్న కేంద్రం

**సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశంలోని శ్రామిక వర్గాన్ని విస్మరించి వారి శ్రమను దోచుకుని బడా పారిశ్రామికవేత్తలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే కార్మిక చట్టాలలో మార్పులు తీసుకువస్తున్నదని సిపిఐ జాతీయ నూతన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ఆరోపించారు. నిత్యం కార్మికులు హక్కుల కోసం ఉద్యమిస్తున్నప్పటికి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన సిపిఐ జాతీయ మహాసభల్లో వెంకటరెడ్డి జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సత్యనారాయణరెడ్డిభవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర సమితి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి కార్మిక వర్గాన్ని చైతన్య పరిచి పోరాట కార్యక్రమాలు రూపొందిండం ద్వారానే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న శ్రమ దోపిడిని అరికట్టడానికి వీలు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి. యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడిగా జస్టిస్ చంద్రకుమార్

**సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా జస్టీస్ బి.చంద్రకుమార్ ఎన్నికైనారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా దుర్గాప్రసాద్, నర్సింహా, సెక్రటరీ జనరల్‌గా కార్యదర్శిగా పి.మల్లేష్, ఉపాధ్యక్షులుగా ఇ.వెంకటేష్, ఎండి అబ్దుల్, ప్రధాన కార్యదర్శులుగా పవన్ కళ్యాణ్, లింగయ్యనాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సూర్యకిరణ్, సంయుక్త కార్యదర్శిగా భద్రునాయక్, కోశాధికారి రఘునాథ్ ఎన్నికైనారు. వీరితో పాటు మరో 5గురు కార్యవర్గ సభ్యులుగా నియమితులైనారు.

## లయన్స్‌క్లబ్, హోప్ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయం

**శేరిలింగంపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్, హోప్ ఫౌండేషన్ ద్వారా కొండా విజయ్ చేస్తున్న సేవలు శ్లాఘనీయమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీయం మర్రి భాస్కర్ అనా న్నరు. ఫల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో వాలింటర్లుగా పనిచేస్తున్న 7వందల మంది వాలింటర్లకు లయన్స్‌క్లబ్ ఆఫ్ హోప్, హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో ఉదయం టిఫిన్స్‌తో పాటు మద్యాహ్నం భోజనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌బీఐ ఏజీయం మర్రి భాస్కర్, హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్‌తో కలిసి ఆయా ఫల్స్ పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న వాలింటర్లకు భోజనాలను అంద జేశారు. ఈ సందర్భంగా మర్రి భాస్కర్ మాట్లాడుతూ.. హోప్ ఫౌండేషన్ ద్వారా ఫల్స్‌పోలియో కేంద్రాలలో పనిచేస్తున్న వాలింటర్లకు భోజన సదుపాయాలను కల్పించటం గొప్ప విషయమన్నారు. శేరిలింగంపల్లి పరిధిలో 133 ఫల్స్‌పోలియో కేంద్రాలకు భోజనాలను అందించటంపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా ధన్యవాదాలుతెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు బర్క మల్లేశ్‌యాదవ్, మారం ప్రసాద్, సింఫు దాసరి రాజశేఖర్, వడ్ల విష్ణుమూర్తి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ మహిళా క్రీడాకారులను అభినందిస్తున్న రైల్వే జిఎం

## మహిళలు క్రీడారంగాల్లోనూ ప్రతిభకనబర్చాలి

### దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్

**కంటోన్మెంట్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** మహిళలు క్రీడా రంగాలలో మరింత ప్రతిభకనబర్చాలని దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. 47వ ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ (మహిళా) ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన రైల్వే మహిళా కబడ్డీ జట్టును ఆయన అభినందించారు. ఆల్ ఇండియా రైల్వే మహిళా కబడ్డీ టోర్నమెంట్స్‌లో దక్షిణ మధ్య రైల్వే మహిళా జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. 3వ స్థనంలో చెన్నైయ్‌లోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రైల్వే జిఎం చేతుల మీదుగా కబడ్డీ క్రీడాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

## వెస్ట్‌బెంగాల్ లోక్‌జనశక్తి పార్టీ నేతలకు ఘనస్వాగతం

**శేరిలింగంపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త :** దేశంలో జనశక్తి మజ్దూర్ సభ, లోక్‌జనశక్తి పార్టీ బలోపేతానికి కృషిజరుగుతోందని తెలంగాణ రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సభ అధ్యక్షులు సురేందర్ అన్నారు. వెస్ట్‌బెంగాల్ లోక్‌జనశక్తి పార్టీ లేబర్ సెల్ జనశక్తి మజ్దూర్ సభ చీఫ్ జనరల్ సెక్రటరీ తపన్ ధరం, ప్రధాన కార్యదర్శి శాంతను మండల్‌లు భెల్‌కు విచ్చేశారు. వారికి బిహెచ్ఈఎల్‌లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు సమావేశమై పలు అంశాలను చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. బీహార్ ఎన్నికల అనంతరం జనశక్తి మజ్దూర్ సభ జాతీయ సమావేశాలను నిర్వహించుకునే అవకాశాలపై కూడా చర్చించటం జరిగిందని సురేందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావడంపై వెస్ట్‌బెంగాల్ నేతలు తపన్ ధరం, ప్రధాన కార్యదర్శి శాంతను మండల్‌లు ఆనందం వ్యక్తం చేశారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి

### బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సరస్వతి

**సరూర్‌నగర్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం చిన్నారులకు పోలియోవ్యాధి రాకుండా పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ సరస్వతి బడంగ్‌పేట్‌లోని కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేసి ఇమ్యూనైజేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కల మందును వేయించాలని కోరారు. కాగా కార్పొరేషన్‌లో నిర్దేశిత కేంద్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమం ముమ్మరంగా సాగింది.

## సంగీతప్రియుల్ని తన్మయుల్ని చేసిన స్వరరాగ ప్రవంతి

**రవీంద్రభారతి, అక్టోబరు 12 ప్రభాతవార్త :**

నాన్‌స్టాప్ 108 సినీగీతాలతో బహుగళ సుమధుర గీతాలాపనగా సాగిన మీనాక్షీ స్వరరాగ ప్రవంతి సంగీతప్రియుల్ని తన్మయుల్ని చేసిందని ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు అన్నారు. 12గంటలు నిర్విరామంగా సాగిన ఈకార్యక్రమాన్ని ఆస్వాదిస్తున్న వారే నిజమైన సంగీతప్రియులని కితాబిచ్చారు. మీనాక్షి గ్రూప్ ఆబాలగోపాలం సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన సంస్థ గ్రాండ్‌గాలా 250 ప్రముఖ గాయకుల మధురగళాల నుండి ఆణిముత్యాల్లాంటి 108పాటలు ఏకధాటిన జాలువారి సంగీతలోకం లో విహరింపజేశాయని కొనియాడారు. ప్రముఖ గాయకుడైన బహుళగళ గాయక కంఠీరవ, మాధవ పెద్ది ఫేం, శ్రీభారతి సంస్థ వ్యవస్థాకుడు చింతల పాటి సురేష్ తెలుగు చలనచిత్రసీమలోని అలనాటి గీతాల నుండి నేటి యువతరాన్ని ఉర్రూతలూగి స్తున్న మాడ్రన్ సాంగ్స్ మొత్తం 108 గీతాలు పాడి అలరించారు. సంగీత్ సితారే వినోద్‌బాబు, సంగీతగురు రామాచారి, వై.ఎస్.రామకృష్ణ, శివరంజని రాజేష్, స్వర్వాహిని కోటేశ్వరి, చాగంటి జ్యోతిర్మయి, రాధిక, సునంద, కృష్ణవేణి తదిత రులు ప్రధాన గాయకుడు సురేష్‌తో గళంకలిపి సుస్వరాల సుగంధ పరిమణాలు కురిపించి మరిపించి మెప్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమంలో వాసూరావు, తనికెళ్ళ సూర్యమీనాక్షి, గాయకుల సాహిత్య సంగీత సేవలను సురేష్ ప్రతిభా పాటవాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సముద్రాల వేణుగోపాలాచారి, విశిష్ట అతిథులు వాసూరావు, రామాచారి, దైవజ్ఞశర్మ, యాదాద్రి హనుమతీపీఠం గురువు బ్రహ్మశ్రీ దోసపాటు గురురాజారావు, మైహోం అవతార్ జమలాపురం రామకృష్ణ, పసుమర్తి రాజరాజేశ్వరి తదితరులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE 1 SENIOR CIVIL JUDGE, AT: HYDERABAD**
**I.A No. 1006 of 2025 IN O.S NO. 622 OF 2025**

Between:
**Smt. Sweta Tiwari** ...Plaintiff
Vs.
**Pushpa Tiwari & Another** ...Defendant

As per the directions of the HON'BLE I SENIOR CIVIL JUDGE, AT: HYDERABAD, in I.A No. 1006 of 2025 in O.S No. 622 of 2025, in above mentioned case, the Defendant No.1 & 2, PUSHPA TIWARI & PAVAN TIWARI is hereby directed to appear before the HON'BLE I SENIOR CIVIL JUDGE, AT: HYDERABAD on **28.10.2025.** The publication in this newspaper is a proof of service of summons on you.

**Defendant's Address:**
1. **Pushpa Tiwari,** W/o. Late Rajendra Prasad Tiwari, Aged about 61 years, Occ: Housewife, R/o. 4-2-123, Badi Chowdi, Sultan Bazar, Hyderabad - 500001
2. **Pavan Tiwari,** S/o. Late Rajendra Prasad Tiwari, Aged about 39 years, Occ: Employee (Driveezy), R/O 4-2-123, Badi Chowdi, Sultan Bazar, Hyderabad - 500001

**M/s. GANDETI'S LAW FIRM, G. VENKAT GOUD & Associates, Advocates**
Office at Unit No.1107, 11th Floor, Asian Suncity Commercial B-Block, Behind Sharath City Capital Mall, Kothaguda X Roads, Kondapur, Hyderabad-500084. **Cell : 90009 08321**

**IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MEDCHAL**
**O.S. No. 751 of 2025**

Between:
**Kurukanti Kamalarathnam & Others** ...Plaintiffs
AND
**Sudheer Kumar Sureddi & another** ...Defendants

**NOTICE**

To,
**Whom so ever it may concerned** ...Defendant No. 2

Please take notice that the above named Plaintiffs filed Suit in O.S. No.751 of 2025 on the file of Hon'ble III Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal for Declaration of their status with the deceased Kurukanti Kamal Kumar and other reliefs in respect of plot bearing No.68, on a total land measuring 100 Sq.yards or 83.67 Sq.meters in Sy.No.151 situated at Maruthi Nagar, Quthbullapur Village and Mandal, then in Ranga Reddy District and now under Medchal-Malkajgiri District, against you and another. The above said Suit in O.S. No.751 of 2025 is posted on **26-11-2025 at 10.30 AM** for your appearance and answer if any. Therefore, I, hereby requested you to appear in the above said Suit in O.S.No. 751 of 2025 on the file of Hon'ble III Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal, either in person or through an advocate on **26-11-2025 at 10.30 A.M.,** before the above Hon'ble Court, otherwise the matter will be decided in your absence as per law.

//BY ORDER OF HON'BLE COURT//
**Sd/- PUSHADAPU SUBBA RAO ADVOCATE**
R/o. H.No.5-270/02, Chandra Nagar, Chintal, Hyderabad-500054.
**Ph: 9440346561**
**Counsel for the Plaintiffs**

**IN THE COURT OF HON'BLE I JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S.NO. 769 OF 2025**

Between:
**Smt. Sudha Desai & others** ...Plaintiffs
And
1. **The Tahasildar,** Secunderabad Mandal, Secunderabad.
2. **All Concerned** ...Defendants

The above case is filed by the Plaintiff against you for declaring her as legal heirs of Late Sri. Vinod Kantilal Desai, and the same is posted to **16.10.2025** before the above said court at **10.30 am,** please take notice that anybody having any objection for granting the above said relief, they may come and oppose the same before the above said court on the above said date in person or through their advocate. If no objections are received the matter will be decided ex-party.

//By the Order of Court//
**P. VIKRAM KUMAR ADVOCATE**
# Plot No.24, Ravi Cooperative Society, Tirmulgherry, Secunderabad-15.
**Cell: 9849483379**

## కొడంగల్ అభివృద్ధి పరిరక్షణకు ఐక్య కార్యాచరణ

### విద్యాసంస్థల తరలింపు నిర్ణయంపై సమిష్టిగా ప్రతిఘటన

**కొడంగల్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** కొడంగల్ నుంచి విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే సహించేది లేదని కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ కొత్రికె లక్ష్మీనారాయణ గుప్త, కోకన్వీనర్లు గంటి సురేష్‌కుమార్, ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, ఎస్‌ఎం.గౌసన్, నవాజ్, రమేష్‌బాబు, నవాజ్, వెంకట్‌రాంరెడ్డి, అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, నిఖిల్, అమీద్, పవన్‌లాహోటీ, ఆరీఫ్, శాంత్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం స్థానిక రెడ్డిబసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను తరలించవద్దని వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, వ్యాపారస్థులతో ఎర్రన్‌పల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్‌టబుల్ సమావేశంలో కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యచరణ



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలాల పాఠశాలలను లగచర్లకు తరలించవద్దని, కొడంగల్ ప్రాంతానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని అన్నారు. అప్పాయిపల్లిలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాలను, పాతకొడంగల్‌లో నిర్మించ తలపెట్టిన సమీకృత గురుకులాలను లగచర్లకు ఎందుకు తరలిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మెడికల్ కళాశాల నిర్మానానికి భూ సేకరణ చేసి పరిహారం అందించి సంవత్సరం నుండి మెడికల్ కళాశాల నిర్మిస్థామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

## సమాజ హితమే లక్ష్యం కావాలి : ఎంపి ఈటల

**మేడిపల్లి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** గత 25 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆదర్శయూత్ అందరికి ఆదర్శంగా నిలుస్తోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ వినాయకనగర్‌లోని ఆదర్శయూత్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం (రజతోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్యలు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా నిర్వహించిన అలాయ్ బలాయ్ ఆత్మీయ పలకరింపులతో ధూంధాం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బోనాలు, బతుకమ్మలతో పాటు పోరాజుల విన్యాసాలు అందరిని అలరించాయి.

# కొత్త సారథి ఎవరు?



- మేడ్చల్ డిసిసి పదవిపై ఉత్కంఠ
- గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం
- ఈసారి బలమైన నాయకత్వం కోసం పరిశీలకుల అన్వేషణ
- స్థానిక శ్రేణుల నుంచి ముమ్మరంగా అభిప్రాయ సేకరణ
- ఏడాదిగా హర్షవర్ధన్ రెడ్డి చేతిలో సారథ్య బాధ్యతలు
- బలమైన బిసి నేతకు అప్పగించాలని యోచన
- రేసులో ప్రభాకర్ గౌడ్, శ్రీశైలం గౌడ్
- హరివర్ధన్ రెడ్డిని కొనసాగింపుపై సందిగ్ధం

**మేడ్చల్, అక్టోబరు 12. ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్‌లో స్థానిక నాయకత్వం బలోపేతానికి పార్టీ అధిష్టానం సీరియస్‌గా దృష్టిపెట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ చతికిలపడిపోవడంతో ఈసారి పూర్తి స్థాయిలో పట్టు సాధించాలంటే పార్టీ నాయకత్వం పటిష్టంగా ఉండాలని భావించింది. ఇందులో భాగంగా డిసిసిని పునర్‌వ్యవస్థీకరించటానికి వ్యూహరచన చేస్తోంది. మేడ్చల్ జిల్లా రాజకీయంగా ప్రాధాన్యమైన ప్రాంతం కావడంతో, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఇక్కడి ఫలితాలపైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. పార్టీ చైతన్యం తగ్గిపోవడానికి ముఖ్య కారణం బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడమేనని అధిష్టానం గుర్తించింది. అందుకే ఇప్పుడు పార్టీ పునరుజ్జీవంపై దృష్టిపెట్టింది.

**హరివర్ధన్‌కే మళ్లీ ఛాన్స్ ఇస్తారా?**

ప్రస్తుతం పార్టీకి జిల్లా అధ్యక్షుడుగా హరివర్ధన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన జిల్లా కాంగ్రెస్‌లోని సీనియర్ నాయ కులలో ఒకరు. గతంలో

**జవసత్వాలు తెచ్చేదెవరు?**

గత ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. మేడ్చల్ నుంచి మల్లారెడ్డి, మల్కాజిగిరి నుంచి మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానంద్ గౌడ్, కూకట్‌పల్లి నుంచి ఎం.కృష్ణారావు, ఉప్పల్ నుంచి బండారు లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచారు. ఈ ఫలితాలతో కాంగ్రెస్ జిల్లా స్థాయిలో బలహీనంగా మారడంతో, పార్టీని తిరిగి బలపర్చడం ఇప్పుడు అనివార్యమైంది.

**బిసికే సారథ్యం**

ఈ నేపథ్యంలో జిల్లా నాయకత్వ మార్పుపై పార్టీలో స్థానికంగా ఉత్కంఠ రేపుతోంది. కొత్త ఉత్సాహం తెచ్చేలా బీసీ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించ డంతో, అధ్యక్ష పదవిపై బీసీ నాయకులు పోటీపడుతున్నారు.



అభిప్రాయసేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జాతీయ కాంగ్రెస్ నాయకురాలు అంజలీ నింబాల్కర్, నేతలు

దేవేందర్‌గౌడ్‌పై మేడ్చల్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అనంతరం పరిగి నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున కూడా పోటీ చేశారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరి .. గత అసెం బ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి టికెట్ ఆశిం చారు. ఫలించకపోవడంతో అలకపూనిన హరివర్ధన్‌ను అధిష్టానం బుజ్జగించి మేడ్చల్ జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టింది.

**రేసులో మరో ఇద్దరు**

ఈ రేసులో ముఖ్యంగా నక్క ప్రభాకర్ గౌడ్, కూన శ్రీశైలం గౌడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రభాకర్ గౌడ్ 1989లో శామీర్‌పేట్ వార్డ్ మెంబర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, సర్పంచ్‌గా, జడ్పీటీసీగా, టిడిపి తరఫున సేవలందించారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్రమశిక్షణ, స్థానిక స్థాయిలో పని చేసిన శక్తి కారణంగా ఆ నాటి నుంచే జిల్లాలో విశేషమైన గుర్తింపు ఏర్పడింది. ఆయనకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో పాటు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో కూడా సుదీర్ఘ సన్నిహిత సంబంధం ఉంది. టిడిపి కాలం నుంచే ఈ ముగ్గురి మధ్య రాజకీయ అనుబంధం కొనసాగింది. రేవంత్ రెడ్డి జెడ్పీటీసీగా ఉన్న సమయంలో ప్రభాకర్ కూడా అప్పటి

# సమర్థులకే పార్టీ పగ్గాలు

### డిసిసి అధ్యక్షుడి ఎంపికపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతన డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియలో భాగంగా స్టేషన్ ఘనపూర్‌లో నిర్వహించిన అభిప్రాయసేకరణ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీ దేబాసిస్ పట్నాయక్, పీసీసీ అబ్జర్వర్ షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రజాస్వామ్య బద్ధంగా, అందరి అభిప్రాయం మేరకు జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న డీసీసీ ఎంపికలో ప్రక్రియలో అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతుంది అన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం పని చేసే వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కోఆర్డినేటర్లు ఎండి.అవేజ్, శ్రీకాంత్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు, మాజి శాసనసభ్యులు శ్రీ కొమ్మూరి ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, డైరెక్టర్లు మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలే

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో సబితా ఇంద్రారెడ్డి

**షాద్‌నగర్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, అన్నారు. జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం జూబ్లీహిల్స్‌లోని ఎల్లారెడ్డి గూడా కాలనీలలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డితోపాటు ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ఎన్నికలలో బీఆర్ఎస్‌కు విశేష స్పందన వస్తోందని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు



ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ

విసిగి పోయారని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'సుప్రీం'పైనే ఆశలన్నీ

- ఉన్నత న్యాయస్థానానికి బిసి పంచాయితీ
- రిజర్వేషన్లపై సర్కార్ నిర్ణయంతో కాంగ్రెస్ నేతల్లో చిగురిస్తున్న ఆశలు
- ఎమ్మెల్యేల మెడకు చుట్టుకుంటున్న స్థానిక సమస్యల బాధ్యత
- తలనొప్పిగా మారిన పరిష్కార చర్యలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** బిసి రిజర్వేషన్ల అంశమై సుప్రీంకోర్టుకు వెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి నట్లు ప్రచారం జరగుతుండటంతో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జీవో 9కి వ్యతిరేకంగా ఇటీవల హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో ఎన్నికల ప్రక్రి యకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి మించకుండా ఎన్నికలు జరుపవచ్చని హైకోర్టు సూచనలు కూడా చేసింది. అయితే, 50 శాతానికి పైగా ఇచ్చిన రిజర్వేషన్లను జ సీట్లుగా పరిగణించాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది. ప్రభుత్వం త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం కోరనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

సోమవారం స్పెషల్ లీవ్ పిటిషన్ లేదా అత్యవసర విచారణ కింద పిటిషన్ దాఖలు చేయనున్నదని న్యాయనిపుణులు అంటున్నారు. స్థానిక సంస్థలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ, మున్సిపల్ పాలకవర్గాల పదవికాలాలు ముగిసి నెలలు గడిచిపోయాయి. ప్రజాప్రతినిధులు లేనందున స్థానిక సమస్యల పరిష్కార బాధ్యతలు ఎమ్మెల్యేల, ఎంపీల, మంత్రుల మెడకు చుట్టుకున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారం అనునిత్యం తలనొప్పిగా మారింది.

# పల్స్ పోలియో విజయవంతం



రంగారెడ్డి జిల్లా కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి లలీత దేవి అన్నారు. హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌తో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు 4,20,911 మంది లక్ష్యంగా సాగిన కార్యక్రమం మొదటి రోజు 3,16, 282 చిన్నరులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో 42 కేంద్రాలు, గ్రామీణ ప్రాంతంలో 1,129 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసి లక్ష్యాన్ని విజయవంతంగా చేరినట్లు తెలిపారు. 150 మంది రూట్ సూపర్వైజర్లు 6204 మంది బూత్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెట్రో స్టేషన్, బస్ స్టేషన్‌లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. మరో రెండు రోజులపాటు మిగిలిన చిన్నారులకు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసి పోలియో లేని సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు పోతామన్నారు.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 12, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు గ్రామాల్లో, పట్టణాల్లో, వార్డులో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాల వద్ద ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు వేశారు. పల్స్‌పోలియో (సబ్‌నేషనల్ పల్స్‌పోలియో) కార్యక్రమాన్ని తూంకుంట మున్సిపాల్టీలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని పిల్లలకు చుక్కలు వేసి ప్రారంభించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దీనిలో శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు. జిల్లాలోని ఉప్పల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పాల్గొని పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి పోలియో వ్యాధి నివారణకు కృషి చేయాలని ప్రజలకు ఆయన సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి మల్లాపూర్ పట్టణ ప్రాథమిక



తూంకుంట మున్సిపాల్టీలో పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

ఆరోగ్యకేంద్రంలో పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాలను ప్రారంభించారని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి పేర్కొన్నారు. జిల్లాలో 1,125 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న ఐదేళ్లలోపు పిల్లలు 5లక్షల 24వేల973మంది పిల్లలు ఉన్నట్లు, పోలియో చుక్కలు వేయటం జరుగు తుందని, మిగిలిన వారికి ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు ఇంటింటా సిబ్బంది పర్యటించి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆమె తెలి పారు. జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేస్తా మన్నారు. 31మొబైల్ టీమ్స్, 31ట్రాన్సిస్ట్ టీమ్స్ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. హైరిస్క్ ఉన్న ప్రాంతాల్లో మొబైల్ టీమ్స్ వెళ్లి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయటానికి చర్యలు తీసుకున్నామన్నారు.

## వ్యాగనార్, మోటార్ బైక్ ఢీ

### ఇద్దరికి తీవ్రగాయాలు, ఆసుపత్రికి తరలింపు

**పెద్దేముల్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** వ్యాగన్‌ఆర్, మోటార్ బైక్ ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం..తాండూరు నుంచి తొరుమామిడి వైపు వెళుతున్న వ్యాగన్‌ఆర్, తట్టెపల్లి నుంచి తాండూరు వైపు వస్తున్న మోటార్ బైక్ పెద్దేముల్ మండలం హన్మాపూర్ గేటు సమీపంలో ఢీ కొన్నాయి. దీంతో మోటారు బైక్‌పై ఉన్న తట్టెపల్లి గ్రామానికి చెందిన చిన్నరాములు, షాపూరం రాముకు వారిద్దరికి కుడి కాళ్ళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇట్టి విషయంపై పెద్దేముల్ ఎస్‌ఐ వేణుకుమార్‌ను వివరణ కోరగా సాయంత్రం వరకు పిర్యాదు రాలేదని తెలిపారు.





# ఎవరో చేస్తారని ఎదురు చూడక..

- స్వచ్ఛందంగా రహదారికి మరమ్మతులు
- సొంత ఖర్చుతో మట్టి తెప్పించి గుంతలు పూడ్చివేత
- కాంగ్రెస్ యువనేత శివశంకర్ ఆదర్శం

**కొత్తూరు, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎవరో వస్తారని..ఏదో చేస్తారని ఎదురు చూడకుండా చీకట్లో చిరుదీపం వెలిగించవోయ్ అన్నాడొక కవి. అదే బాటలో నడిచి పదిమందికి ఆదర్శంగా నిలిచారు కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్. వివరాల్లోకి వెళితే.. వర్షాల ప్రభావంతో కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. గుంతల వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు తరుచు ప్రమాదాలకుగురువుతున్నారు. ఈ మార్గంలో ప్రపంచంలో అతిపెద్దది అయిన శాంతివనం ఉంది. అక్కడ జరిగే మెడిటేషన్ శిబిరాలకు వేలాది మంది జనం అక్కడికి వస్తూ ఉంటారు. బెంగళూరు హైవేకి దారితీసే ఈ



రహదారి పనులను పర్యవేక్షిస్తున్న యువ నేత శివశంకర్ గౌడ్

మార్గంలో వందలాది ప్రవేటు వాహనాలు రాకపోకలు చేస్తారు. తీగాపూర్, చేగూరు, మల్లాపూర్, తాళ్లగూడ, అక్కివేని గూడ, గూడూరు, మక్తా గూడ తదితర గ్రామాల ప్రజలు బాహ్యప్రపంచంలోకి రావాలంటే ఈ మార్గంలోనే రాకపోకలు చేస్తారు. అయితే కనీసం తాత్కాలిక రిపేర్లు చేయటానికి కూడా సంబంధిత అధికారులు చొరవ చూపటం లేదు. ప్రతి చిన్న పనికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా సమిష్టిగా చేయిచేయి కలిపి గతంలో అనేక సమస్యల భరతం పట్టిన ఉదంతాలు తెలుగురాష్ట్రాలలో అనేకం ఉన్నాయి. అదే స్ఫూర్తిని అందిబుచ్చుకున్న శివశంకర్ గౌడ్ తిమ్మాపూర్ రోడ్డుపై నిత్యం వాహనచోదుకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని.. పనులు చేయటంలేదని నిందిస్తూ కూర్చోకుండా



మరమ్మతులకు ముందు అధ్వానంగా ఉన్న రోడ్డు



మరమ్మతుల అనంతర దృశ్యం

తనవంతుగా రహదారి అభివృద్ధికి తోడ్పడాలని రంగంలోకి దిగారు. అర కిలోమీటర్ల మేర అధ్వాన్నంగా మారిన ఈ రహదారి కోసం రూ.30 వేల ఖర్చును తన సొంతంగా భరించి టిప్పర్ల ద్వారా నల్లమట్టి తెప్పించారు. డోజర్ సహాయంతో రోడ్డు లెవెల్ చేయించారు. ఈ పనులను స్వయంగా దగ్గర ఉండి పర్యవేక్షి ంచారు. రహదారి సమస్యకు మోక్షం రావడంతో స్థానికులు శివశంకర్ గౌడ్‌ను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా వన్నాడ శివశంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలిగితే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. అధికారులు, ప్రభుత్వం మీదకు నెట్టివేయకుండా, సాధ్యమైనంతవరకు వాటి పరిష్కారానికి ఎవరికి వారు స్వచ్ఛందంగా చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వసుపుల మహేందర్, డోలి శ్రీనివాస్, ఎండి రఫీక్, మాజీ వార్డ్ సభ్యుడు అరుణ్, గణేష్, పాశం అంజి, శ్రీకాంత్, వినోద్, సాయి, ఈశ్వర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్టాపన దృశ్యం

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**దుద్యాల్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. రెండు రోజులపాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా భారీ ధ్వజస్తంభం, నవగ్రహాలు, ఆలయంలో వీరభద్రేశ్వర స్వామి, రేణుకచార్య విగ్రహాల ు ప్రతిష్ఠించారు. ఈ వేడుకల ు తిలకించడానికి గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు, చిన్నారులు, యువతి యువకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తుల శివనామ స్మరణతో అనంతరం ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం శివ పార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి మహిళలు బోనాలు సమర్పించారు. దీంతో గ్రామంలో రెండు రోజులుగా భక్తి పరవశం నిండుకుంది. గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు అందరు ఈ వేడుకలకు హాజరు కావడంతో గ్రామంలోని ప్రతి ఇంటిలో సందడి సందడిగా నెలకొంది. గ్రామానికి చెందిన గజ్జెల నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ వేడుకల ు నిర్వహించారు. గ్రామస్తులు సైతం వేడుకల ు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

## సిమెంటు ఇటుకతో కొట్టి.. భర్తను హతమార్చిన భార్య

**కేశంపేట, అక్టోబరు 12 ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలో సిమెంట్ ఇటుకతో కొట్టి భర్తను చంపిన భార్య ఉదంతమిది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట మండల కేంద్రంలోని ఎస్సీ కాలానికి చెందిన కొప్పు కుమార్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై నిత్యం భార్య మాధవితో గొడవ పడుతున్నాడు. శనివారం రాత్రి మద్యం సేవించి వచ్చి భార్యతో ఘర్షణకు దిగాడు. దీంతో విసిగి వేసారిన మాధవి తన భర్త నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో తలపై దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం ఎవరికి తెలియకుండా ఉండేందుకు ఇంటి ముందరే ఉన్న నీటి సంపులో మృతదేహాన్ని పడేసింది. మృతుడి కుమారుడైన సుశాంత్, సోదరుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

## కుమారుడ్ని హత్యచేసి..

**షాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గత వారం రోజుల క్రితం మండల పరిధిలోని కురువగూడ గ్రామంలో దాదే బాల కృష్ణ (45)ను తండ్రి నర్సింలు, మృతుని సోదరుడు రాఘవేందర్ కలిసి హత్య చేశారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు చున్నీతో ఇంట్లోనే ఉరివేశారు.